క్లుప్తంగా

బూత్‌స్థాయి సహాయకుల జాబితా అందించాలి

ఆసిఫాబాద్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీలు తమ బూత్‌స్థాయి సహాయకుల జాబితాను అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 24లోగా పరిష్కరించాలన్నారు. జనవరిలో తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు ప్రతీ పోలింగ్ కేంద్రంలో తమ సహాయకులను నియమించాలని సూచించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఈ నెల 9 వరకు అవకాశం ఉందని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకునేలా ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతిని ధులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి

తిర్యాణి: అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంగి ఫారెస్టు బీట్ అధికారి బుక్య రవి అన్నారు. మంగళవారం మండలంలోని మంగి గ్రామంలో కార్చిచ్చు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవిలో సంచరించే జంతువులకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎక్కడైనా పులి సంచారం ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఫారెస్టు సిబ్బందికి సమాచారం అందించాలని పేర్కొన్నారు. బీట్ అధికారులు రాము, మధుకర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి: కెరమెరి మహిళా మండల సమాఖ్యలో స్త్రీనిధి రికవరీ సీఆర్‌పీగా విధులు నిర్వహించేందుకు ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణురాలై, సంఘ సభ్యురాలై ఉండాలన్నారు. ప్రతీరోజు రూ. 400 చొప్పున గౌరవ వేతనం, ఉద్యోగ కాల వ్యవధి 4 నెలలు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, పదో తరగతి ధ్రువీకరణపత్రంతో జత చేసి ఈ నెల 10 వరకు మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

లింగాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గుమ్నూర్(బి) పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు.

'వేడి ఆహారం అందించాలి'

కెరమెరి: విద్యార్థులకు వేడి ఆహారాన్ని అందించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం మండలంలోని మోడి కేజీబీవీని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంట చేసే పాత్రలు, పరికరాలు, కూరగాయలను ప్రతిరోజు శుభ్రంగా కడగాలని సూచించారు. ఎస్‌వో ప్రవీణ ఉన్నారు.

'ఎండీఎంలో నిర్లక్ష్యం చేస్తే ఏజెన్సీని తొలగిస్తాం'

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం చేసే ఏజెన్సీని తొలగిస్తామని మండల విద్యాధికారి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాధితుడికి పరామర్శ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని దుబ్బగూడ కాలనీకి చెందిన రైతు సురేశ్ పెద్దపులి దాడిలో గాయపడగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంచిర్యాలలోని ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

'హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: కౌటాల మండలం మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అదనపు కలెక్టర్ పాఠశాల తనిఖీల్లో కుళ్లిపోయిన కోడిగుడ్లు, పాడైన ఆలుగడ్డలు దర్శనమివ్వడతో పాటు విద్యార్థులకు నీళ్ల సాంబారు పెట్టినట్లు తేలిందన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులను విధుల నుంచి తొలగించాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొడిసెల కార్తిక్, కార్యదర్శి టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి, నాయకులు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- మండలంలో రెండు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు
- రెండు మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు అనుమతి
- కొన్ని రకాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తున్న మిల్లర్లు
- తుపాను నేపథ్యంలో ఆందోళన చెందుతున్న రైతులు



రవీంద్రనగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం

చింతలమానెపల్లి: మండలంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరిధాన్యం కొనుగోలు చేయడంలో సమస్యల కారణంగా ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రారంభంలో సన్నరకం వడ్లను కొనుగోలు చేయని నిర్వాహకులు ప్రస్తుతం ఏకంగా కొనుగోళ్లనే నిలిపివేశారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్లు పేచీలు పెడుతుండడతో సమస్య తలెత్తింది.

రెండు కొనుగోలు కేంద్రాలు..

మండలంలోని చింతలమానెపల్లి, రవీంద్రనగర్‌లలో ప్రభుత్వం వరిధాన్యం సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొద్ది రోజుల క్రితం అదనపు కలెక్టర్ దీపక్ తివారి రవీంద్రనగర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల సంక్షేమం కోసమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులు ధాన్యాన్ని కేంద్రాలలోనే విక్రయించాలని ఆయన పేర్కొన్నారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఇప్పటి వరకు రవీంద్రనగర్ కొనుగోలు కేంద్రంలో కేవలం 1800 బస్తాల దొడ్డు వరి ధాన్యం 20మంది రైతుల నుంచి కొనుగోలు చేసి 1694 బస్తాలను రైస్‌మిల్‌కు తరలించారు. ఇంకా సుమారు 500 బస్తాల దొడ్డు వరి ధాన్యం కేంద్రం వద్ద తూకం వేయకుండా ఉంది. సన్నరకం వరిధాన్యం 500 బస్తాల వరకు కేంద్రం వద్ద నిల్వ ఉంది. చింతలమానెపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 262 క్వింటాళ్ల వరిధాన్యం సేకరించారు. ఈధాన్యాన్ని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రైస్‌మిల్‌కు పంపించగా ఏకంగా 7క్వింటాళ్ల కోత విధించారు. ప్రశ్నించిన రైతులకు అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కాగా వరిధాన్యం కొనుగోలు చేయడం లేదనే సమాచారంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించడం లేదు.

మిల్లర్ల పేచీ..

రైస్‌మిల్‌లలో అక్రమాలతో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో పరిమిత సంఖ్యలో రైస్‌మిల్లులకు వరిధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చింది. చింతలమానెపల్లి, రవీంద్రనగర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి కేవలం రెండు మిల్లులకు ధాన్యం తరలించే అవకాశం ఉండడంతో సమస్య తలెత్తింది. ఈమిల్లుల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు పేచీలు పెడుతున్నట్లుగా సిబ్బంది తెలుపుతున్నారు. సన్నరకంలో సాధారణ సన్నరకాలను కొనుగోలు చేయడం లేదని, జైశ్రీరాం వరిధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని మిల్లర్లు చెబుతున్నట్లు స్థానిక సిబ్బంది తెలిపారు. దీంతో కొనుగోళ్లను నిలిపివేసినట్లు పేర్కొంటున్నారు. డీఎస్‌వోకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆందోళన..

కొనుగోలు కేంద్రాలకు తరలించాల్సిన ధాన్యం కొనుగోళ్లు నిలిచి పోవడంతో పంట భూముల్లోనే ఉంచుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సైతం ధాన్యంపై కవర్లు కప్పి ఉంచుతున్నారు. ఓవైపు తుపాను సమాచారంతో కమ్ముతున్న మబ్బులు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షం కురిస్తే ధాన్యం తడిసి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



గత నెల 27న 40 క్వింటాళ్ల సన్నరకం వరి ధాన్యం రవీంద్రనగర్ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాం. కానీ ధాన్యం కొనుగోలు చేయడం లేదు. కవర్లు కప్పి ఉంచుతున్నాం. వర్షం పడితే ధాన్యం నాణ్యత చెడిపోతుంది. అధికారులు వెంటనే కొనుగోలు చేయాలి.

- చౌదరి శంకర్, బాలాజీ అనుకోడ

ఇబ్బందులు పడుతున్నాం..



మండలంలో వరిధాన్యం కొనుగోలు చేయడం లేదు. చింతలమానెపల్లి, రవీంద్రనగర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నాం. వరిధాన్యం కొనుగోలు చేయకుంటే దళారుల చేతిలో నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

- పరేశ్ కవిరాజ్, రవీంద్రనగర్

సమస్య పరిష్కారానికి చర్యలు

మిల్లర్ల సమస్య వల్ల కొనుగోళ్లు నిలిచిపోయాయి. సమస్య త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. పరిమిత సంఖ్యలో రైస్‌మిల్లులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున సమస్య తలెత్తింది. ఉన్నతాధికారులకు సమస్యను ఇప్పటికే తెలియజేశాం.

- నర్సింహులు, డీఎం, జిల్లా సహకార సంఘం

వాంకిడిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో దత్తారావు

వాంకిడి: 2023 –24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై మంగళవారం డీఆర్‌డీవో దత్తారావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గత 10 రోజుల నుంచి మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం వారు ఉపాధిహామీ పథకం ద్వార చేపట్టిన పనులు, ఖర్చులకు సంబంధించిన రికార్డులపై ఆడిట్ నిర్వహించి, డీఆర్‌పీలు, నివేదికలను రూపొందించారు. ఖర్చుల్లో అవకతవకలు, అభివృద్ధిని వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధిహామీలోని 451 పనులకు సంబంధించి రూ.4.57 కోట్లు ఖర్చు కాగా పీఆర్‌లోని 99 పనులకు సంబంధించి రూ.3.16 కోట్లు ఖర్చయినట్లు వెల్లడించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై విచారించి సంబంధిత అధికారులపై రూ.58,000 జరిమానాతో పాటు రూ.10,97,702ల రికవరీకి ఆదేశించారు.

అవకతవకలు ఇలా..

తనిఖీల్లో దాదాపుగా ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి తప్పిదాలు వెలువడ్డాయి. జాబ్‌కార్డులు అప్‌డేట్ లేకపోవడం, డిమాండ్ ఫారమ్‌లో రైతుల సంతకాలు తీసుకోకపోవడం, పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకుండానే బిల్లులు చేయడం, మస్టర్‌లలో పేర్లు లేకపోవడం, ఒకే వ్యక్తి వివిధ రకాలుగా సంతకాలు చేయడం, ఒకరి పేరున మరొకరు పనికి వెళ్లడం, పనికి మించి బిల్లులు చేయడం, కొలతల బుక్‌లు సరిగ్గా నిర్వహించకపోవడం, పనులకు వెళ్లని వారి సంతకాలు తీసుకుని బిల్లులు చేయడం, కట్టలు, చేపల చెరువుల కొలతల్లో భారీగా తేడాలు ఉండటం, క్వాలిటీ లేని పనులు, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా ఉండటం, పనులు జరిగిన ప్రదేశాలలో రైతులు పంటలు సాగు చేసుకోవడం వంటి అవకతవకలు వెలుగు చూశాయి. పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

దహెగాం: తమ సమస్యలు పరిష్కరించాలని మండల ఆశా కార్యకర్తలు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వైద్యాధికారిని అశ్వినికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు గందె శోభ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. మహేశ్వరీ, శోభ, పద్మ పాల్గొన్నారు.

నేటి ధర్నా జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఆశా వర్కర్ల డిమాండ్ నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం పట్టణంలోని నవేగాంబస్తీ, సర్‌సిల్క్‌కాలనీ, భట్‌పల్లి, ఈజ్‌గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గోపాలకాల

కౌటాల: కౌటాల కంకలమ్మ ఆలయ 20వ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో భక్తిశ్రద్ధలతో గోపాలకాల కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో మనిరాం చూద్రి ఆధ్వర్యంలో రామాయణ వార్కరి భజన మండలి గుండాయిపేట్ ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా ఆలయంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులను సన్మానించారు. జాతర హుండీ ఆదాయం లెక్కింపును ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు. హుండీ ద్వారా రూ.74,910 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు. గత వారం రోజులుగా నిర్వహించిన కంకలమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ముగిశాయి.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సిర్పూర్(టి): మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో గిరీషన్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సోహెల్ అహ్మద్, నీరటి సత్యనారాయణ, ఎల్ములే శంకర్, వడ్డేటి నానయ్య, నేరెళ్ల అశోక్, అశోక్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి వచ్చిన ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్‌ను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

'ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యం'

కాగజ్‌నగర్‌రూరల్: ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై చార్జిషీట్ విడుదల చేశారు. ఏ గ్రామంలో కూడా 40 శాతానికి మించి రుణమాఫీ జరగలేదన్నారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్నాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు సత్యనారాయణ నాయకులు పాల్గొన్నారు.

మహిళా శక్తి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మహిళా శక్తి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక గ్రూపులకు రూ.కోటి 26 లక్షల మహిళా శక్తి రుణాలు, రూ. 5లక్షల 40 వేల వీధి వ్యాపారుల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని కాపువాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన్ ఔషధి మందుల దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

రుణమాఫీ చేయకుండానే విజయోత్సవాలా?

కౌటాల: వందశాతం రుణమాఫీ చేయకుండానే ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మంగళవారం కౌటాల- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రైతులు చేపట్టిన ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గంలోనే 50శాతం రుణమాఫీ కాలేదని ఆరోపించారు. రుణమాఫీ కాని రైతులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు కౌటాల రైతు వేదికలో కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు వానుపటేల్, నాయకులు మల్లయ్య, మోతీరాం, బండురావు, రవీందర్, సత్తయ్య, భూమయ్య, చందు, శ్రీకాంత్, మిథున్, తిరుపతి, శ్యామల పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'హామీల అమలు కోసం పోరాడుదాం'

రెబ్బెన: ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుదామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆటో యూనియన్‌లను కలిసి ఈనెల 7న ఒక్కరోజు చేపట్టనున్న ఆటో, ట్యాక్సీ, వ్యాన్, క్యాబ్‌ల రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఆటో మోటర్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును అమలు చేయాలన్నారు. ఆటో యూనియన్ నాయకులు నర్సింగరావు, రాజగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, కిషోర్, మహేశ్, నారాయణ, జగన్, శ్రావణ్, రవి, శ్యాం ప్రసాద్, మల్లేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఈవోపై చర్యలు తీసుకోవాలి'

కాగజ్‌నగర్‌రూరల్: పెంచికల్‌పేట్ మండలంలో ప్రాథమికంగా నిర్వహించిన పంట నష్టం సర్వే సక్రమంగా చేయకపోవడతో అసలైన రైతులకు అన్యాయం జరిగిందని వెంటనే సంబంధిత వ్యవసాయశాఖ విస్తరణాధికారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్సీ దండె విఠల్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. ఏఈవో శ్రీవిద్య క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఇంటివద్దనే కూర్చుని తనకు అనుకూలంగా ఉన్న వారికి మేలు చేసిందన్నారు. ఎమ్మెల్సీ స్పందించి ఏఈవోపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారికి సిఫారసు చేశారు.

టీఎస్ యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

వాంకిడి: టీఎస్ యూటీఎఫ్ నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమారి, సోయం ఇందురావులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా బండె హరీశ్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా జమీల్, శారద, కోశాధికారిగా రాజలింగులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

బెజ్జూర్: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన ముదిరాజులు రాబోయే రోజుల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధి కోసం చేపలు పెంచేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. బాబాసాగర్‌తో పాటు ఇతర జలాశయాల్లో ముదిరాజులకు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు భీమేష్, వెంకటేశ్, మల్లేశ్, శంకర్, చిలుక శంకర్, బోస్ల శ్రీశైలం, యాటకారి శంకర్, ధోని రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



ఆసిఫాబాద్‌అర్బన్: బహుమతులు అందజేస్తున్న అధికారులు



పెంచికల్‌పేట్: భవిత కేంద్రంలో..



తిర్యాణి: కేక్ కట్ చేస్తున్న ఎంఈవో

పెంచికల్‌పేట్: మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో రమేశ్‌బాబు హాజరై మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల్లో ప్రతిభకు కొదువ లేదన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి, ఐఆర్‌పీ సుజాత, సీఆర్‌పీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: అంగవైకల్యం శరీరానికే కాని మనస్సుకు కాదని ఎంఈవో అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రం పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు సుమన్, కుమార్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌సీలో ఎంఈవో రాథోడ్ సుభాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్‌లు హాజరయ్యారు. విద్యార్థులు కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ మధుకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సుభాష్, నిజాముద్దీన్, ఎంఆర్‌సీ సిబ్బంది అనూప్‌కుమార్, సంతోష్, ఐఈఆర్‌పీలు రమణ, స్రవంతి, సీఆర్‌పీలు సుభాష్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ 15 మంది దివ్యాంగులకు ఆర్థికసాయం అందజేశారు. బానోత్ కిషన్, వినోద్, అంబాజీ, దవీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల కోసం ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. జిల్లాలో 102 మంది దివ్యాంగుల విద్యార్థులకు ఉపకరణాలు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మధుకర్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, హెచ్‌ఎం రమణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంఈవో గావుడే హన్మంతు, ఉపాధ్యాయులు క్రిష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెబ్బెన: దివ్యాంగులు తమలోని వైకల్యాన్ని చూసి కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన దివ్యాంగ చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎంఈవో వెంకటేశ్వర్, తాండూర్ ఎంఈవో మల్లేషం, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం మండలకేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉన్న భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో వేణుగోపాల్ కేక్ కట్ చేసి దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఐఆర్‌పీ మానస, కేజీబీవీ ఎస్‌వో నాగసుధ, ఎంఐఎస్ ప్రశాంత్, సీసీవో ప్రకాశ్, సీఆర్‌పీ రమేశ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని భవిత కేంద్రం, డివిజనల్ రిసోర్స్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

పాముకాటుకు ఆవు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్‌లో పాముకాటుకు ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం ఎంఆర్‌సీలో ఓవైపు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరుగుతుండగా.. కార్యాలయం ఆవరణలో ఆవు గడ్డి మేస్తుండగా పాముకాటుకు గురై మృతి చెందింది.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

పెంచికల్‌పేట్: గ్రామంలో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని అగర్‌గూడ గ్రామంలో మంగళవారం ఉదయం ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలను దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతీ ఒక్కరు వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

దహెగాం: గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రాజు అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని ఒడ్డుగూడ గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేయడంతో పాటు వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు.

ఆన్‌లైన్ ఎంట్రీ వేగవంతం చేయాలి

వాంకిడి: సమగ్ర సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు కేంద్రాన్ని సందర్శించారు. ఆన్‌లైన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో అజీజుద్దీన్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అభిలాష్‌కు పురస్కారం

ఆసిఫాబాద్‌రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన అవార్డుకు మేదరిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నూతి అభిలాష్ ఎంపికయ్యారు. రోల్ మోడల్ ఆఫ్ తెలంగాణ అవార్డును మంత్రి సీతక్క, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.